క్లుప్తంగా

క్విజ్ పోటీలు

కూకట్‌పల్లి: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని మంగళవారం కూకట్‌పల్లి సిద్ధార్థ కాలేజీలో నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయాద్ మిస్బా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు హాజరై విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మేకల రమేష్, నాగార్జున, గురుమూర్తి, బండారి ప్రవీణ్‌గౌడ్, పల్లపు వేణు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు నిఖిల్, వంశీ, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తంలా సీఎం రిలీఫ్ ఫండ్

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన సాయి గణేష్ అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సందర్భంగా మంజూరైన రూ.75వేల ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, ఎండీ ఇబ్రహీం, మమత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, నటసార్వభౌమ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని బహదూర్‌పల్లి చౌరస్తాలో ఈనెల 24న ప్రతిష్ఠించనున్నట్లు ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ అభిమానులు, పార్టీలకు అతీతంగా నాయకులు హాజరు కావాలని కోరారు.

974 ఆశ వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీఎంహెచ్‌ఓ డా.పుట్ల శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీలలో ఖాళీగా ఉన్న 974 ఆశ వర్కర్ల పోస్టులను భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ కింద ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశ వర్కర్‌గా పని చేయడానికి అభ్యర్థులు కనీసం 10వ తరగతిలో ఉత్తీర్ణత ఉండాలన్నారు. 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు అర్హులన్నారు. సంబంధిత అభ్యర్థులు జీహెచ్‌ఎంసీలోని పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీ పరిధిల్లోని బస్తీల్లో నివసించే వారై ఉండాలన్నారు. స్థానిక భాషలో అనర్గళంగా మాట్లాడాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 27 వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో ఒక ఫొటోను జత చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను సంబంధిత పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీలో అన్ని పని దినాల్లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. న్యూట్రిషన్ కిట్లకు సంబంధించిన పరికరాల నాణ్యతను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గర్భిణులు అధిక సమయం వేచిచూడకుండా త్వరగా కార్యక్రమాన్ని జరిగేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మరో 15 రోజుల పాటు తీవ్రమైన ఎండలు ఉంటాయని, ఎండల కారణంగా వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా అవసరమైన సూచనలు సలహాలు అందజేయాలన్నారు. ఉపాధి హామీ కార్మికులు పనిచేసే సమయంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

వైద్యాధికారుల సమావేశానికి ముందు కలెక్టర్ అమయ్‌కుమార్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, రాష్ట్రస్థాయి వైద్యశాఖ ఉన్నత అధికారులతో జిల్లాలో చేపడుతున్న వైద్యసేవలపై మాట్లాడారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు మాట్లాడుతూ.. గర్భిణుల్లో అనిమియా సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేస్తోందని తెలిపారు.



దుకాణాల కూల్చివేత..

కోలుకోలేని దెబ్బ!



శ్రీహరినగర్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించిన చిరు వ్యాపారుల షాపులు, డబ్బాలు

- దుకాణాల్లోని సామగ్రిని సైతం ధ్వంసం చేసిన అధికారులు
- లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు
- అక్రమ నిర్మాణాలని తొలగించాం: టౌన్ ప్లానింగ్ అధికారులు



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో హైటెన్షన్ లైన్ కింద చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న డబ్బాలను మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. కూకట్‌పల్లి పోలీసుల సహకారంతో ఉదయం 6.30 గంటలకే సుమారు 12 షాపులు పూర్తిగా తొలగించారు. రోడ్డును ఆనుకొని వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సుమారు పదేళ్లుగా కొబ్బరి బోండం, టిఫిన్ సెంటర్, చెప్పులు, చెరుకు రసం, సెలూన్, టీస్టాల్‌ను నడుపుకుంటూ చిరువ్యాపారులు జీవనం సాగిస్తున్నారు.

◆ కనీసం వారికి సమాచారం ఇవ్వకుండా తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద భవనాలు, హోటల్స్ అక్రమంగా ఏర్పాటు చేసుకుంటున్నా పట్టించుకోని అధికారులు చిరువ్యాపారులపై ప్రతాపం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సమాచారం ఇస్తే తమ సామగ్రిని తీసుకెళ్లే వాళ్లమని అంటున్నారు. సామగ్రిని కూడా పూర్తిగా ధ్వంసం చేశారని రోధించారు. టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్ నగేష్‌ని వివరణ కోరగా అవి అక్రమ నిర్మాణాలు కాబట్టి తొలగించామని తెలిపారు.

సిలిండర్ ఇవ్వమన్నా ఇవ్వలేదు..



పదేళ్లుగా టిఫిన్ సెంటర్ నడుపుతున్నాను. ఇడ్లీ, వడలు, చట్నీ, పూరి పిండిలు అన్ని సిద్ధం చేసుకున్నాం. సమాచారం ఇవ్వకుండా ఉదయం వచ్చి పూర్తిగా కూల్చారు. ఒక గంట సమయం ఇవ్వండని వేడుకన్నా కనికరించలేదు. మా కొట్టును కూల్చడమే కాకుండా స్టౌ, సామగ్రిని ధ్వంసం చేశారు. ఆ సామాన్ల విలువ రూ.30వేల పైనే ఉంటుంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ కూడా తీసుకెళ్లారు. మాది మాకు ఇవ్వమన్నా ఇవ్వలేదు.

– రామకృష్ణ, హోటల్ యజమాని

రూ.20వేల కొబ్బరి బోండాలు తీసుకెళ్లారు



రాత్రి ఇంటికి వెళ్లి, మళ్లీ ఉదయం షాపుకు వస్తే షాపు మొత్తం నేలమట్టమై కనిపించింది. పదేళ్లుగా ఇక్కడే కొబ్బరి బోండాలు అమ్ముతున్నాను. షాపు కూల్చడమే కాకుండా కొబ్బరి బోండాలను కూడా తీసుకెళ్లారు. అడిగినా కూడా ఇవ్వలేదు. మున్సిపల్ ఆఫీస్‌కి వెళ్లి కాళ్లపై పడితే కొన్ని ఇచ్చారు. సుమారు రూ.20వేల కొబ్బరి బోండాలు తీసుకెళ్లారు. నాకు కాళ్లు లేవు. వికలాంగుడని అని ప్రాధేయపడినా కనికరించలేదు.

– మల్లారెడ్డి, కొబ్బరి బోండాల షాపు యజమాని

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కల్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న 40మందికి చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, చంద్రారెడ్డి, ఇబ్రహీం, సత్యనారాయణ, సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ

జేఎన్‌టీయూ విద్యార్థి జాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుతో పాటు ఉత్తమ ఆటతీరు ప్రదర్శించిన క్రీడాకారులకు మంగళవారం జేఎన్‌టీయూ ఉప కులపతి నర్సింహారెడ్డి ట్రోఫీతో పాటు రూ.25వేల నగదు బహుమతిని అందజేశారు. – బాలానగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

దుండిగల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సుందర్ నగర్‌కు చెందిన టి.కవిత, ఎల్.నాగలక్ష్మి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉండడంతో శంభీపూర్ రాజును కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 3.5 లక్షలను మంజూరు చేయించారు. కవితకు రూ 1.5 లక్షలు, నాగలక్ష్మి కి రూ రెండు లక్షలు చొప్పున ఎల్‌ఓసి పత్రాలను మంగళవారం బాధితులకు అందజేశారు. దీనికి వారు ఆయనకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటికే ఎంతోమంది నిరుపేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందారని శంభీపూర్ రాజు పేర్కొన్నారు.

శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై ఆయనకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా గర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



శ్రమజీవులకై పోరాటం చేసేది సీపీఐ మాత్రమేనని కూకట్‌పల్లి పార్టీ మండల కార్యదర్శి జి.కృష్ణ అన్నారు. మంగళవారం శ్రీశ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రజాగర్జన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీని తరిమికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. – బాలానగర్

2128 మందికి కంటి పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం 2128 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 46 మందికి కళ్లద్దాలు అందజేశారు. ప్రత్యేక కళ్లద్దాల కోసం 11మంది ఉన్నారు. 52 మందిని శస్త్ర చికిత్సల కోసం సరోజిని దేవి కంటి ఆసుపత్రికి రీఫర్ చేసినట్లు వైద్యాధికారి చందర్ తెలిపారు.

సూరజ్ తివారికి అభినందనలు

బాలానగర్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రథ సారథి రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రోటోకాల్ కమిటీని నియమించారు. ఫతేనగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూరజ్ తివారి కమిటీ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

చంద్రమోహన్‌కు ఎన్టీఆర్ అవార్డు

బంజారాహిల్స్: డాక్టర్ నందమూరి తారక రామారావు శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా వంశీ ఇంటర్నేషనల్ ఇండియా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ చలనచిత్ర నటుడు చంద్రమోహన్‌కు ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ అవార్డును అందించారు. ఈ మేరకు మంగళవారం చంద్రమోహన్ స్వగృహంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సినిమాలు, క్రికెట్, నేరాలు మనుషుల్ని ప్రభావితం చేస్తున్నాయన్నారు. సీనియర్ నటుడు చంద్రమోహన్ కుటుంబ వ్యవస్థను కాపాడేలా సినిమాల్లో నటించారని కొనియాడారు. కూలిపోతున్న కుటుంబ వ్యవస్థ కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రంలో చంద్రమోహన్ పాత్ర తనకెంతో నచ్చిందని అన్నారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, దైవజ్ఞ శర్మ, రచయిత్రి జలంధరా చంద్రమోహన్, దేశాయ్, శ్రీదేవి, శైలజా సుంకరపల్లి, డా తెన్నేటి సుధాదేవి, రాశి మూవీస్ నిర్మాత నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ శిఖరం కేతు విశ్వనాథరెడ్డి

లిబర్టీ: తెలుగు సాహిత్యానికి వెలుగులు నింపిన సాహితీ శిఖరం కేతు విశ్వనాథ రెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ కన్వీనర్ గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ అన్నారు. ఎన్నో రచనలతో తెలుగు ప్రజల హృదయాల్లో తన పేరును సుసంపన్నం చేసుకున్నారన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి రచనలు గుర్తించి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రదానం చేసిందన్నారు. ఆయన వివిధ హోదాల్లో అభ్యుదయ రచయితల సంఘానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ప్రధానంగా రాయలసీమ సాహిత్య ఉద్యమ కార్యాచరణలో కేతు విశ్వనాథ రెడ్డి పాత్ర గొప్పదన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

కార్పొరేటర్ల పర్యటన | సమస్యల పరిశీలన

నేరుగా సమస్యలు తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వాల్మీకినగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వాల్మీకినగర్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో అధికారులతో మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల నిర్మించిన వాల్మీకినగర్ డ్రైనేజీ లైన్, వాటర్ లైన్ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీరోడ్డు నిర్మించాలని విన్నవించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకినగర్‌కాలనీ ప్రెసిడెంట్ శ్రీహరిచారి, అశోక్‌చారి, గోపాల్, అరవింద్, రాముగౌడ్, వజీర్, హుస్సేన్, శివకుమార్, సాయికుమార్, కుమార్, మోహిత్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి..

బాలానగర్: డివిజన్ పరిధిలోని శ్రీశ్రీనగర్, ఇందిరానగర్‌లలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నీటి సమస్య ఎక్కువగా ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. అ కార్యక్రమంలో వాటర్ వర్క్ డీజీఎం వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఏఈ కవిత, ఏఈ మొహమ్మద్ అక్బర్, ఇన్‌స్పెక్టర్ రాములు, వాటర్ వర్క్స్ లైన్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, శానిటేషన్ సిబ్బంది, శ్రీశ్రీనగర్, ఇందిరానగర్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర..



ఏపీహెచ్‌బీలో సమస్యలను అడిగి తెలుసుకున్న కార్పొరేటర్ శిరీష

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీలో మంగళవారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలు, పూర్తి చేసిన నిర్మాణ పనుల గురించి ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఏపీహెచ్‌బీలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్, బండి సుధ, డా. వెంకట్రావు, రవీందర్‌రెడ్డి, జేశ్వంత్, ప్రభు, ఆరోగ్యరెడ్డి, రమణ, వెంకటరమణ, లలిత, మాధురి, సుశీల్, శారద, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం మంగళవారం కేపీస్‌నగర్‌లో పాదయాత్ర చేసి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంజీరా వాటర్ ప్రెషర్ పెంచమని, కేబుల్స్ సమస్య ఉందని, విద్యుత్‌స్తంభాల ఎత్తు కిందకు ఉన్నాయని బస్తీవాసులు తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, శివ, మోయిజ్, బాలరాజు, యోగిరాజుస్వామి, జోగిరెడ్డి, లింగం, చాంద్‌బాయ్, భాను, నరేందర్, ఎస్‌ఆర్‌పీ సురేష్, లింగారెడ్డి, తాజ్‌బీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

తవ్విన రోడ్డును వెంటనే పునరుద్ధరించాలి



మూసాపేట డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు డివిజన్ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ జనతానగర్, ఇందిరానగర్‌లో స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. బస్తీలో నెలకొన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనేక ప్రాంతాల్లో కలుషిత తాగునీటి సరఫరాను అరికట్టడానికి తవ్విన రోడ్లను పునరుద్ధరించాలని అధికారులకు తెలిపారు. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా కలుషిత మంచినీటి సరఫరాను అరికట్టడానికి తవ్విన రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు తుకారాం, విష్ణు, రాజు, నర్సింహ, జైరాజ్, అరుణ్, ఈశ్వర్, సత్యనారాయణ, నర్సింగ్, వెంకటేష్, అభిమన్యు, రాము, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన కార్మికులను ఆదుకున్న బీఆర్‌ఎస్ నేత

కూకట్‌పల్లి: భవన నిర్మాణ కార్మికులు పలు గ్రామాల నుంచి పని నిమిత్తం హైదరాబాద్ వచ్చారు. ఇక్కడికి నమ్మి వచ్చిన కార్మికులు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేయగా మూడు రోజులైనా స్పందించలేదు. దీంతో కార్మికులు రోడ్డుపైనే ఉండిపోయారు. తిరిగి వెళ్లిపోదామనుకున్నా చేతుల్లో డబ్బులు లేవు. ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకు తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో ఆయన వారందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వారు వారి స్వస్థలాలకు వెళ్లడానికి బస్ టికెట్స్, ఖర్చులకు కొంత డబ్బును అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ఏకరూప దుస్తుల కుట్టు కూలీ పెంచాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టైలర్లు

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల, హాస్టళ్ల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల కుట్టుకూలీ పెంచాలని, మరింత గడువు ఇవ్వాలని తెలంగాణ టైలరింగ్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.దశరథ్, అధ్యక్షులు వి.శ్రీనివాసరాజు, కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు ప్రభుత్వం జతకు రూ.50 చొప్పున చెల్లిస్తుందని, పెరిగిన ధరల కారణంగా ఇది ఏ మాత్రం సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం జతకు రూ.150చొప్పున చెల్లించాలని కోరారు. ఈ రంగంపై ఆధారపడి దాదాపు 4 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తమకు జనవరిలో క్లాత్ ఇవ్వాల్సి ఉండగా ఏప్రిల్ 15న అందజేసిందని జూన్ 1వ తేదీ లోగా దుస్తులు కుట్టి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. జూలై నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని కోరారు. డీఈఓ, గత ఏడాది కుట్టిన బిల్లులు ఇంకా రాలేదని అప్పులు చేసి దుస్తులు కుడుతున్నామని ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కుట్టుకూలీ పెంచాలని కోరుతూ ఇప్పటికే మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కమిషనర్ దేవసేనకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఆర్.సతీష్, సుభద్ర, లక్ష్మినారాయణ, కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, వెంకట్‌రెడ్డి, స్వర్ణలత, వరలక్ష్మి, కవిత, సరిత, వెంకటేశం, రమాదేవి, రజని, మంజుల పాల్గొన్నారు.

సమ సమాజాన్ని ఆకాంక్షించిన సాహితీవేత్త విశ్వనాథరెడ్డి



సభలో మాట్లాడుతున్న తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: సమ సమాజాన్ని ఆకాంక్షించిన సాహితీవేత్త ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కేతు విశ్వనాథరెడ్డి సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సంతాపసభలో ఆయన మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథలు వ్రాయడం , కంటే ముందు వేర్లు, బోధి నవలలను రాశారని గుర్తు చేశారు. తెలుగు విభాగం ఆచార్య గోనానాయక్ మాట్లాడుతూ కింది వర్గాలవారిని ఎంతగానో ప్రోత్సహించే వారని అన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి విజయకుమారిలు విశ్వనాథరెడ్డి సేవలను కొనియాడారు.